



కొత్తకోటలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

భారీ వర్షం

- నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో కురిసిన వాన
- స్తంభించిన జన జీవనం
- కొత్తకోటలో రోడ్లు జలమయం

వనపర్తి అర్బన్/అమరచింత/కొత్తకోట/నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 31: వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో మంగళవారం రాత్రి వాన పడగా, వనపర్తి జిల్లాలో బుధవారం సాయంత్రం పడింది. వనపర్తిలో గంటకుపైగా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. వర్షంతో జిల్లాలోని అమరచింత, ఆత్మకూరు, కొత్తకోట, వనపర్తి మండలాలతో పాటు పట్టణాల్లో జన జీవనం స్తంభించింది. రెండు రోజుల నుంచి వాన లేకపోవడంతో ఆందోళనకు గురైన నాట్లు వేసే రైతులు బుధవారం కురిసిన వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు.

అమరచింతలో దంచి కొట్టిన వాన

అమరచింత మండలంలోని బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మునిసిపాలిటీ కేంద్రాలతో పాటు చంద్రఘడ్, మస్తీపూర్, జూరాల ప్రాజెక్టు, నందిమల్ల, నాగల్‌కడుమూర్ తదితర గ్రామాల్లో జోరువాన పడింది. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. డ్రైనేజీలు పొంగి పొర్లగా, రహదారులు జలమయం అయ్యాయి. భారీ వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కొత్తకోటలో పొంగిన డ్రైనేజీలు

కొత్తకోటలో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఈ వానకాలంలో ఇప్పటి కురిసిన వానల్లో ఇదే పెద్ద వర్షం. పొద్దంతా పొడి వాతావరణం ఉండగా.. సాయంత్రం కుండపోత వాన కురవడంతో ఎక్కడి వారు అక్కడే నిలిచి పోయారు. వర్షపు నీటికి పట్టణంలోని డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రోడ్లు చిన్నపాటి కాలువలను తలపించాయి. ఎగువ నుంచి వాన నీరు చౌరస్తాకు రావడంతో నది ప్రవాహాన్ని తలపించింది.

చారకొండలో 48.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 18.1 మిల్లీ మీటర్లు కాగా, చారకొండ మండలంలో అత్యధికంగా 48.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తాడూరులో 46 మిల్లీ మీటర్లు, పదరలో 35.2, నాగర్‌కర్నూల్‌లో 27.4, వంగూరులో 27, వెల్దండలో 26.8, బిజినేపల్లిలో 26.4, కల్వకుర్తిలో 21.4, అమ్రాబాద్‌లో 22.4, ఊర్కొండలో 20.2, కొల్లాపూర్‌లో 18.2, ఉప్పునుంతలలో 11 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.



అమరచింత శివారులో రోడ్డుపై నిలిచిన నీరు

పాలమూరు టు పట్నం

- జనరల్ ఆస్పత్రి నుంచి హైదరాబాద్‌కు మూడు నెలల్లో 380 కేసులు రెఫర్
- జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ కేసులే అధికం
- రోజుకు 10 వరకు 108 అంబులెన్స్‌లు ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు..
- అత్యవసర సమయంలో అంబులెన్సులు దొరకని పరిస్థితి
- ఆస్పత్రి వైద్యాధికారుల పర్యవేక్షణ లోపమే కారణం



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జూలై 31: హైదరాబాద్ వెళ్లాల్సిన పనిలేకుండా మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోనే అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ప్రజాప్రతినిధులు గొప్పలు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఇక్కడ చికిత్స చేయాల్సిన కేసులను సైతం హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు. గడిచిన మూడు నెలల్లో 380 కేసులు రెఫర్ అయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అందులో జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ కేసులే ఎక్కువగా ఉన్నాయి. జనరల్ ఆస్పత్రి నుంచే రోజుకు 10 వరకు 108 అంబులెన్స్ వాహనాలు హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. దీంతో జిల్లాలో ఏదైనా పెద్ద అత్యవసర పరిస్థితి ఎదురైతే ఆ సమయంలో అంబులెన్సులు దొరకని దుస్థితి నెలకొంటోంది. అంతేకాకుండా రోగులు హైదరాబాద్ అంటేనే భయంతో సగం చచ్చిపోతున్నారు. వీటన్నింటిపై పర్యవేక్షణ చేయాల్సిన ఆస్పత్రి వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా శిక్షణ పొందుతున్న డాక్టర్లు ప్రతీ చిన్న కేసును హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు.

జనరల్ ఆస్పత్రి నుంచి రెఫర్ కేసిన కేసుల వివరాలు

నెల	ఆర్థో	జనరల్ సర్జరీ	గైనిక్	జనరల్ మెడిసిన్	కంటి	పిడియాట్రిక్	మొత్తం
ఏప్రిల్	2	28	21	58	4	6	119
మే	8	51	10	60	2	10	141
జూన్	5	22	08	70	2	13	120
మొత్తం	15	101	39	188	8	29	381



రెఫర్ చేసిన రోగిని హైదరాబాద్‌కు తరలిస్తున్న బంధువులు(ఫైల్)

మూడు నెలల్లో..

జనరల్ ఆస్పత్రి నుంచి హైదరాబాద్‌కు రెఫర్ అయ్యే కేసుల సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లోనే 380 కేసులు హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆస్పత్రులకు రెఫర్ అయ్యాయి. అందులో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ కేసులే ఎక్కువగా ఉన్నాయి. ఏప్రిల్‌లో 119 కేసులు, మేలో 141, జూన్‌లో 120 కేసులు రెఫర్ కాగా, జూలైలో దాదాపు 300పైగా కేసులు రెఫర్ అయినట్లు తెలుస్తోంది.

చిన్న చిన్న జబ్బులకు సైతం..

రెఫర్ చేస్తున్న కేసుల్లో చాలా వరకు చిన్న చిన్నవే ఉంటున్నాయి. ఇక్కడ నయం అయ్యే వాటినీ రెఫర్ చేస్తున్నారు. కోయిలకొండ మండలం అభంగపట్నం గ్రామానికి చెందిన నర్సమ్మకు షుగర్ వ్యాధి ఉంది. కాలుకు దెబ్బ తగలడంతో అది సెల్యులైటిస్‌గా మారింది. ఆ కేసు ఇక్కడే ఉంచి డ్రెస్సింగ్ చేస్తూ నయం చేయాల్సి ఉండగా, సర్జరీ విభాగం డాక్టర్లు ఈనెల 28న హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ఉస్మానియా ఆస్పత్రికి వెళ్తే.. అక్కడి ఆర్ఎంవో కేసును అడ్మిట్ చేసుకోలేదు. అంతేకాకుండా ఆ ఆర్ఎంవో జనరల్ ఆస్పత్రి ఆర్ఎంవోకు ఫోన్ చేసి, ఎందుకు ఈ కేసు పంపించారంటూ ఆరా తీసినట్లు తెలిసింది. దాంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రి ఆర్ఎంవో తనకు తెలియదని, విచారణ చేస్తానని చెప్పారని సమాచారం. తర్వాత ఆ రోగిని ప్రైవేట్ అంబులెన్సులో బంధువులు ఇంటికి తీసుకొచ్చారు. అదే విధంగా శివమ్మ అనే రోగి తన ఎడమ చేయి వణుకుతుందని ఈనెల ఏడో తేదీన మధ్యాహ్నం ఆస్పత్రికి వచ్చింది. కానీ ఆమెను అదేరోజు రాత్రి 10:30 గంటలకు ఉస్మానియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆమె అక్కడికి వెళ్లిన తర్వాత చిన్న సమస్య అని చెప్పి మందులు రాసి పంపించారు. ఇలా చాలా వరకు కేసులను అనవసరంగా హైదరాబాద్‌కు పంపిస్తున్నారు.

అంబులెన్సులు దొరకని పరిస్థితి..

జనరల్ ఆస్పత్రి నుంచి రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు దాదాపు ఐదు నుంచి ఎనిమిది అంబులెన్సులు హైదరాబాద్‌కు వెళుతున్నాయి. జిల్లాలో ఉన్న 108 అంబులెన్సు వాహనాలు 16 ఉన్నాయి. అందులో రోజూ దాదాపు ఎనిమిది వరకు అంబులెన్స్‌లు హైదరాబాద్‌కు వెళ్తుండటంతో ఇక్కడ ఏదైనా అత్యవసర పరిస్థితి ఉన్నపుడు అవి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తమ డ్యూటీ అయిపోయినా హైదరాబాద్‌కు పంపుతున్నారని, డబుల్ డ్యూటీ అవుతుందని అంబులెన్సు పైలెట్లు వాపోతున్నారు. నడవగలిగిన వారు, అత్యవసర పరిస్థితి లేని వారిని సైతం అంబులెన్సులలో పంపిస్తుండటంతో అత్యవసర పరిస్థితి ఉన్నవారికి నష్టం జరుగుతోంది.

అధికారుల పర్యవేక్షణ లోపం..

ప్రతీ చిన్న కేసు ఆస్పత్రి నుంచి రెఫర్ అవుతుందంటే అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే జరుగుతుందని తెలుస్తోంది. పీజీ డాక్టర్లు, శిక్షణ పొందుతున్నవారు, వైద్య విద్యను అభ్యసిస్తున్న డాక్టర్లు సైతం హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు. వాస్తవానికి హైదరాబాద్‌కు రెఫర్ అయ్యే కేసులు అన్ని ఆర్ఎంవో పర్యవేక్షణలో ఉంటే ఇలాంటి ఇబ్బందులు ఉండవు. వారే స్వయంగా కేసును పరిశీలించి, 108 అంబులెన్సుకు ఫోన్ చేసే సౌకర్యం కల్పిస్తే అనవసరంగా రెఫరల్ కేసుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

రెఫరల్స్‌పై ప్రణాళిక రూపొందిస్తాం



జనరల్ ఆస్పత్రి నుంచి అనవసరంగా హైదరాబాద్‌కు రెఫర్ అవుతున్న కేసులపై ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తాం. సూపర్ స్పెషాలిటీకి సంబంధించిన కేసు తప్ప, ఏ ఇతర కేసు కూడా హైదరాబాద్‌కు రెఫర్ కాకుండా చూసేందుకు కృషి చేస్తాను. ఇకపై ప్రతీ విభాగం నుంచి రోజూ ఓపీ, అడ్మిషన్, రెఫరల్ కేసులు ఎన్ని అనే అంశాలపై నివేదికలు తెప్పించుకొని వాటిపై చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ సంపత్ కుమార్ సింగ్,
జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్



శ్మశాన వాటిక వద్ద మృతుడి బంధువులతో మాట్లాడుతున్న ఎస్ఐ

నా భర్త మృతిపై అనుమానం ఉంది

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఓ మహిళ
- శవాన్ని శ్మశాన వాటిక నుంచి ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం

ఉండవల్లి, జూలై 31: తన భర్త మృతిపై అనుమానం ఉందని ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు అంత్యక్రియలను నిలిపేశారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని అప్పగించారు. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవల్లి మండల కేంద్రానికి చెందిన గొల్ల జమ్మన్న(65)కు, తక్కశిల గ్రామానికి చెందిన గొల్ల నాగమ్మతో 45 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దకు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ గొడవల కారణంగా పెళ్లయిన 15 సంవత్సరాల తర్వాత నాగమ్మ పిల్లలతో కలిసి పుట్టినిల్లు తక్కశిలలో ఉంటోంది. జమ్మన్న తన సోదరుల దగ్గర ఉండేవాడు. కాగా జమ్మన్న మంగళవారం మృతి చెందాడు. బుధవారం ఉదయం అంత్యక్రియలు చేయడానికి శవాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న జమ్మన్న సంతానం, భార్య వచ్చి మృతి చెందిన విషయం తమకు చెప్పలేదని అడిగారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని నాగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు శ్మశాన వాటికకు చేరుకుని, బంధువులతో మాట్లాడారు. శవాన్ని అలంపూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకవచ్చి, పోస్టుమార్టం నిర్వహించారు. తిరిగి సాయంత్రం బంధువులకు అప్పగించగా, అంత్యక్రియలు నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక వివరాలు తెలుస్తాయని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

వరదొచ్చినా.. నిండని చెరువులు

- రిజర్వాయర్ల నుంచి అయిజ మండల చెరువులకు వదలని నీరు
- నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు బిగించని షట్టర్లు
- ముచ్చోనిపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని వృథాగా వదులుతున్న నిర్వాసితులు
- తమకు న్యాయం జరుగకపోతే రోడ్డెక్కుతామంటున్న రైతులు



నాగర్‌దొడ్డి రిజర్వాయర్ ప్రధాన తూము దగ్గర లేని నీరు

అయిజ, జూలై 31: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని రిజర్వాయర్ల నుంచి అయిజ మండలంలోని చెరువులకు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. తమకు న్యాయం జరుగకపోతే ఆందోళన చేస్తామని అంటున్నారు. పథకంలో భాగంగా నాగర్‌దొడ్డి, ముచ్చోనిపల్లి రిజర్వాయర్లను నింపి, అక్కడి నుంచి అయిజ మండలంలోని చెరువులకు నీటిని వదలాలి. ముచ్చోనిపల్లి రిజర్వాయర్‌కు ఇప్పటి వరకు షట్టర్లు బిగించలేదు. ఆ రిజర్వాయర్ నుంచి అయిజ మండలంలోని చెరువులకు నీటిని విడుదల చేసేందుకు డ్యాం చివరి భాగం నుంచి కాల్వ తీశారు. అయితే దానిని పూర్తిగా చేపట్టలేదు. దాంతో నీటిని వదులుతున్న ప్రతీసారి రైతులు తమ భూముల గుండా నీళ్లు వెళ్తున్నాయని అడ్డుకుంటున్నారు. మరోవైపు ముంపు రైతులు రిజర్వాయర్‌లో నీళ్లు నిల్వ ఉంటే తమ భూములు ముంపునకు గురవుతున్నాయని నిల్వ ఉండకుండా వృథాగా వెళ్లేలా చేస్తున్నారు. నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు షట్టర్లు బిగించినా.. నిర్వాసిత రైతులు వాటిని పగుల గొట్టడమో లేదంటే తెరచి ఉంచడమో చేస్తున్నారు. ఇక్కడ కూడా రిజర్వాయర్‌లో నీళ్లు నిల్వ ఉన్నప్పుడు ముంపు భూముల్లో చేరుతున్నాయని ఈ విధంగా చేస్తున్నారు. దాంతో నీరంతా దిగువకు వృథాగా పోతోంది. ఫలితంగా నీరంతా అయిజ మండలంలోని వాగులు, వంకల ద్వారా తుంగభద్ర నదిలోకి వెళ్లి కలుస్తోంది. తద్వారా రాయలసీమకు మేలు జరుగుతోంది. ఈ రెండు రిజర్వాయర్లు నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క సారి కూడా పూర్తిగా నింపలేదు. అందుకు ముంపు రైతులు ఆటంకం కలుగజేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి రిజర్వాయర్లను నిర్మిస్తే.. తమకు నీరందకుండా చేయడం సరి కాదని అయిజ మండల రైతులు అంటున్నారు. ఈ రిజర్వాయర్లు గద్వాల నియోజకవర్గంలో ఉండగా, అయిజ అలంపూర్ నియోజకవర్గంలో ఉంది. దాంతో ఇక్కడి చెరువులకు నీటిని విడుదల చేయడంలో గద్వాల అధికారులు పట్టనట్లు ఉంటున్నారని, అలంపూర్ నియోజకవర్గ అధికారులు, ప్రజా ప్రతినిధులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు కృష్ణానదికి వరద వస్తున్నందున రిజర్వాయర్లను పూర్తిగా నింపి, తమ పొలాలకు నీరివ్వాలని, లేదంటే ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.



నాగర్‌దొడ్డి రిజర్వాయర్ ప్రధాన తూము వద్ద వేసిన వేరుశనగ పంట



అయిజ, తూంకుంట రోడ్డుపై వృథాగా వెళ్తున్న నాగర్‌దొడ్డి రిజర్వాయర్ నీరు

రాజకీయం చేయొద్దు

రైతుల విషయంలో పార్టీలకు అతీతంగా పని చేయాలి. రాజకీయం చేయొద్దు. రూ.కోట్లు ఖర్చు చేసి రిజర్వాయర్‌లు నిర్మించింది భూములకు నీరందించడం కోసమే. ప్రస్తుతం కృష్ణానదికి వరద వస్తున్నందున రిజర్వాయర్లును పూర్తి స్థాయిలో నింపి, పంటలకు అందించాలి. నీరు వృథాగా దిగువనున్న రాయలసీమకు వెళ్తోంది.

- పోతుల మధుసూదన్‌రెడ్డి,
సింగిల్‌విండో అధ్యక్షుడు

న్యాయం జరుగకపోతే రోడ్డెక్కుతాం

తుమ్మలపల్లి, నాగర్‌దొడ్డి రిజర్వాయర్లను నింపి, సాగు నీరు అందించాలి. డ్యాంలు నిర్మించింది మొదలు ఇప్పటి వరకు రిజర్వాయర్లను నింపిన దాఖలాలు లేవు. రిజర్వాయర్లకు నీరు రాకుండా వృథాగా బయటకు వదులుతున్నారు. ఈ విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అశ్రద్ధ చేస్తున్నారు. న్యాయం చేయకపోతే రోడ్డెక్కుతాం.

- నాగిరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు,
అయిజ

నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌లోకి వరద కొనసాగుతోంది

నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌లోకి వరద కొనసాగుతోంది. తూముల దగ్గర కాస్త లీకేజీ ఉండటంతో వాటిని సరి చేశాం. ఈ నెల 16వ తేదీన ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి నీటిని వదిలాం. 19వ తేదీ నుంచి రిజర్వాయర్‌లోకి నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 26 శాతం నీరు చేరింది.

- సూర్యప్రకాష్‌రెడ్డి,
నీటి పారుదల శాఖ ఏఈ

బ్యాంకుల వద్ద రైతుల బారులు



ఎస్‌బీఐలో బారులు తీరిన రైతులు

కోయిలకొండ, జూలై 31: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీతో రైతులు మండలంలో బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. ఉదయం నుంచి గంటల తరబడి లైన్‌లో ఉండి, తమ రుణాలు మాఫీ అయ్యాయో లేదో అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఒకటే కౌంటర్ ఏర్పాటు చేయడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుణమాఫీ ప్రక్రియ నేపథ్యంలో బ్యాంకులో ఇతర పనులు నిలిచిపోయాయి. బ్యాంకు పరిధిలోని కోయిలకొండ, పారుపల్లి, ఇబ్రహీంనగర్, ఆచార్యపూర్, పారుపల్లి గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల రైతులు బ్యాంకు వద్దకు వచ్చి వివరాలు తెలుసుకుంటున్నారు. మండలంలో మొదటి విడతలో రూ.లక్ష లోపు 975 మందికి రుణమాఫీ కాగా, రెండో విడతలో రూ.లక్షా 50 వేలు 430 మందికి మాఫీ అయ్యింది. అయితే ఇప్పటి వరకు మొదటి విడత రైతులకు 50 శాతం కూడా రుణాలు రెన్యూవల్ కాలేదు. బ్యాంకు అధికారులు రుణమాఫీ కావడానికి 20 రోజుల సమయం పడుతుందని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు వద్ద కనీసం తాగడానికి నీరు, కూర్చోడానికి వసతులు కల్పించాలని కోరుతున్నారు. బ్యాంకు మేనేజర్ శైలేష్‌ను వివరణ కోరగా మొదటి విడతలో రూ.లక్ష మాఫీ అయిన 300 మందికిపైగా రైతులకు ఇప్పటివరకు రుణాలు అందించామని, రుణమాఫీ అయిన అందరికీ రెన్యూవల్ చేస్తామని చెప్పారు. అందుకు కొంత సమయం పడుతుందని అన్నారు.

గోనెసంచిలో కుక్క.. చెరువులో పడేసి

- మాట వినడం లేదని కుమారుడిని చంపేందుకు తండ్రి యత్నం
- సంచి కదలడంతో ఆరా తీసి, కాపాడిన మత్స్యకారులు
- పరారైన వ్యక్తి

కొల్లాపూర్, జూలై 31: క్షణికావేశంలో తండ్రి కొడుకును చంపడానికి యత్నించాడు. ఈ సంఘటన కొల్లాపూర్ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండలానికి చెందిన ఓ వ్యక్తి తన కుమారుడు(10) చెప్పినట్లు వినడం లేదని, సరిగా చదవడం లేదని కోపంతో కొట్టాడు. అనంతరం గోనె సంచిలో ఉంచి, నోట్లో వస్త్రం కుక్కి తన ఆటోలో ఊరి చివర ఉన్న చెరువు వద్దకు తెచ్చాడు. సంచి చెరువులో వేసి, కాళ్లతో తొక్కుతుండగా సంచి కదిలింది. చెరువు కట్టపై ఉన్న మత్స్యకారులు, స్థానికులు గమనించి ఏంటని అడిగారు. అది కుక్క పిల్ల అని బదులిచ్చాడు. మూటలోంచి చిన్నపిల్లాడి ములుగులు వినిపించడంతో వారు మూటను బయటికి తీశారు. సంచి తెరిచి చూస్తే పదేళ్ల బాలుడు ఉన్నాడు. మత్స్యకారులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇస్తుండగానే తండ్రి పరారయ్యాడు. కొల్లాపూర్ ఎస్ఐ రుషికేష్ అక్కడికి చేరుకుని బాలుడితో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత తల్లిని పిలిపించి, అప్పగించారు. బాలుడు సురక్షితంగా ఉన్నాడని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కందనూలులో గంజాయి కలకలం

- 27 ప్యాకెట్లు స్వాధీనం
- పట్టుపడ్డ ఇద్దరు మైనర్లు
- పోలీసుల అదుపులో గ్యాంగ్?

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 31: నాగర్‌కర్నూల్‌లో గంజాయి కలకలం రేపింది. 27 గంజాయి ప్యాకెట్లను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు పట్టణంలో చర్చ జరిగింది. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గంజాయి ఎక్కడి నుంచి తెస్తున్నారు?, ఎవరెవరికి విక్రయిస్తున్నారనే సమాచారాన్ని పోలీసులు సేకరించే పనిలో ఉన్నారని తెలుస్తోంది. గంజాయి క్రయ విక్రయాల్లో దాదాపు 15 మంది గ్యాంగ్ ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్పీ సీరియస్‌గా విచారణ చేపడుతున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. గంజాయితో పట్టుబడింది మైనర్లు కావడంతో పోలీసులు గోప్యంగా ఉంచి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక సీఐని వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శిశువు మృతదేహం లభ్యం

తెలకపల్లి, జూలై 31 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని అనంతసాగర్ చెరువు కట్ట అలుగు దగ్గర బుధవారం సాయంత్రం ఆడశిశువు మృతదేహం లభించింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ నరేష్ సంఘటన స్థలానికి వెళ్లి శిశువు మృతదేహం పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధరలు

దేవరకద్ర, జూలై 31: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మార్కెట్ యార్డుకు బుధవారం రైతులు ఉల్లిని విక్రయించేందుకు తీసుకవచ్చారు. బహిరంగ వేలంలో గరిష్ఠ ధర క్వింటాల్‌కు రూ. 3310, కనిష్ఠ ధర రూ. 2670 పలికింది. గత నెలరోజుల నుంచి ధర స్వల్పంగా పెరుగుతోంది. గతం లో పండించిన ఉల్లిని ధరలు తక్కువ ఉండటంతో రైతులు ఇప్పటి వరకు నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం కొంతమేర ధరలు పెరగడంతో రైతులు అమ్మకానికి తీసుకవచ్చారు. 78 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు. గత వారం కంటే ఈ వారం క్వింటాల్‌కు రూ. 200 ధర పెరిగింది. గత నెల రోజుల నుంచి ఉల్లి ధరలు స్వల్పంగా పెరగడంతో సామాన్య ప్రజలు ఉల్లి కొనుగోలు చేయలేకపోతున్నారు. ఉల్లి వ్యాపారులు బయట కేజీ రూ. 50 నుంచి రూ. 80వరకు విక్రయిస్తున్నారు.

90 పరుగుల ఆధిక్యంలో మహబూబ్‌నగర్ జట్టు

- ఆరు వికెట్లు తీసి రాణించిన అరుణ్

- అర్ధసెంచరీ చేసిన శ్రీకాంత్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 31 : హెచ్‌సీఏ త్రీడేస్ లీగ్ టోర్నీ రెండో మ్యాచ్ రెండో రోజు ఉమ్మడి జిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగుల ఆధిక్యం సాధించింది. బుధవారం ఘట్‌కేసర్ రాంపల్లి మైదానంలో ఆట రెండో రోజు హైదరాబాద్ బ్లూస్ జట్టు 96 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్ అరుణ్ 18.1 ఓవర్లలో 42 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు తీసి రాణించాడు. గణేష్ రెండు వికెట్లు తీశాడు. అనంతరం మొదటి ఇన్నింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 75 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టానికి 186 పరుగులతో ఆడుతుంది. జట్టులో శ్రీకాంత్ 131 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్స్‌లతో అర్ధసెంచరీ(65) పరుగులు సాధించాడు. మహ్మద్‌షాదాబ్ 24 పరుగులు చేయగా, కొండశ్రీకాంత్ 20, అరుణ్‌కుమార్ 15 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. జిల్లా జట్టు క్రీడాకారులు బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణించడం జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి పట్ల రాజశేఖర్ అభినందించారు.

క్రీడాకారుడికి సన్మానం

జడ్చర్ల, జూలై 31 : హర్యాన రాష్ట్రంలోని భివానీ పట్టణంలో జరిగిన 42వ జాతీయస్థాయి సీనియర్ నెట్‌బాల్ క్రీడాపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారుడు జశ్వంత్‌కు బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. జడ్చర్ల మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పారిజాత మాట్లాడుతూ ఈ నెల 25నుంచి 28వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి నెట్‌బాల్ క్రీడాపోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున విద్యార్థి జశ్వంత్ పాల్గొని ప్రతిభ కనబరిచారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాంత సమన్వయకర్త బాహోద్దీన్, జహీరొద్దీన్, నలీమొద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదాయం ఘనం..సౌకర్యాలు శూన్యం

- వసతులు లేక ఇబ్బందులు పడుతున్న బీచుపల్లి ఆలయ భక్తులు

- పట్టించుకోని దేవాదాయ శాఖ

ఎర్రవల్లి, జూలై 31: ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రాలలో బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. కృష్ణానది ఒడ్డున వెలసిన ఆంజనేయస్వామికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి భక్తులు నిత్యం వస్తుంటారు. ఈ ఆలయం ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి దగ్గర 44వ జాతీయ రహదారిపై ఉంది. కానీ వసతులు లేక అరకొర సౌకర్యాలతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయానికి ప్రతీ ఏడాది కోటి రూపాయలకు పైగా ఆదాయం ఉన్నా అభివృద్ధి మాత్రం అంతంతే ఉంది. భక్తులకు కల్పించాల్సిన వసతులపై దేవాదాయ శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. స్నానాల గదులు, దుస్తుమార్పిడి గదులు, మరుగుదొడ్లు అసౌకర్యంగా ఉండటం, అపరిశుభ్రత వంటి సమస్యలు వేధిస్తున్నాయి.



బీచుపల్లిలో అరకొరగా ఉన్న దుస్తువులు మార్చుకునే గదులు

క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా..

ప్రతీ ఏడాది బీచుపల్లి ఆంజనేయస్వామి జాతర మహోత్సవం నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా కొనసాగుతుంది. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారికి దాసంగం, నైవేద్యాలను సమర్పిస్తారు. దీంతో పాటు శ్రావణ మాసం, మాఘమాసం, కార్తీక మాసం, అమవాస్య, పౌర్ణమి లాంటి ప్రత్యేక రోజుల్లో దేవాలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. బీచుపల్లి ఆంజనేయస్వామి సన్నిధిలో వివాహాలు చేస్తుంటారు. భక్తులు బస చేయడమే కాక అస్థికల నిమజ్జనం వంటి కార్యక్రమాలకు నిత్యం వస్తుంటారు. ఇక్కడికి వచ్చే భక్తులు కృష్ణానదిలో స్నానాలు చేశాక దుస్తు మార్పిడి గదులు లేకపోవడంతో భక్తుల అవస్థ వర్ణనాతీతం. ఉన్నవి అపరిశుభ్రంగా ఉన్నా భక్తుల నుంచి పైసలు వసూలు చేయడం గమనార్హం. మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంటుంది. దేవాలయం ముందున్న సుందరీకరణ పార్క్ కూడా కనపడటం లేదు.. వీటన్నింటిపైనా దేవాదాయశాఖ దృష్టి సారించి బీచుపల్లి క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు కోరుకుంటున్నారు.



దేవాలయం ముందు బురదమయంగా మారిన పార్క్

గ్రామ పంచాయతీ జోక్యం

పుష్కరఘాట్ దగ్గర దుస్తువుల మార్పిడి గదులకు, పార్కింగ్‌కు, మరుగుదొడ్లకు గ్రామంలో పలుకుబడి కలిగిన నాయకుడి జోక్యం కల్పించుకుని దేవాదాయశాఖ చూడాల్సిన పర్యవేక్షణను తప్పించి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వేలంను నిర్వహించి టెండరుకు అప్పగించారు. అదే అదునుగా భావించిన దేవాదాయశాఖ, తమకు బాధ్యత లేదన్నట్లుగా చేతులు దులుపుకుంది. రూ. లక్షల్లో టెండర్‌ను దక్కించుకున్న వారు ఇష్టానుసార వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామ పంచాయతీకే తెలుసు

పుష్కరఘాట్ దగ్గర పార్కింగ్‌కు, దుస్తులు మార్పిడి గదులు విషయం గ్రామ పంచాయతీకే తెలుసు. తమకు సంబంధం లేదు. లక్షల్లో అరాజ్ చేసి దక్కించుకున్న వారే వాటి బాధ్యత చూస్తారు. దేవాలయ ముందు పరిశుభ్రతను పాటిస్తున్నామని, పట్టుబడిన గోవులను పోలీసులు ఇక్కడికి తెచ్చి వదలడంతో పార్క్ పరిస్థితి అలా తయారు అయింది.

- రామన్‌గౌడ్ ఈవో, బీచుపల్లి ఆలయం

'బస్సు సర్వీసులను పునరుద్ధరించండి'

ఉండవల్లి, జూలై 31: గద్వాలజిల్లా ఉండవల్లి మండలంలోని గ్రామాలకు గతంలో కర్నూలు నుంచి ఆర్‌టీసీ బస్సు సర్వీసులు ఉండేవని, రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సర్వీసులు నిలిపివేయడంతో ప్రజలకు రవాణా సౌకర్యం ఇబ్బందిగా మారిందని, పునరుద్ధరించాలని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి కోరారు. బుధవారం గ్రామస్థులతో కలిసి రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లేఖ రాశారు. తమ సొంత గ్రామం కంచుపాడుతో పాటు ఉండవల్లి, తక్కశిల, మారమునగాల, ప్రాగటూర్, చిన్న ఆముదాలపాడు, శేరుపల్లి గ్రామాలకు బస్సు సర్వీసులు పూర్తిగా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులను పునరుద్ధరించడం వలన గద్వాల, కర్నూలు, రాయచూర్, హైదరాబాద్ వంటి పట్టణాలకు ప్రయాణించడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బీటీ రోడ్డు ఉన్నా బస్సులు నడపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామాలకు బస్సు సర్వీసులను పునఃప్రారంభానికి తగు చర్యలు తీసుకోవా లని మంత్రికి రాసిన లేఖలో కోరారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

కొత్తకోట, జూలై 31 : విద్యుదాఘాతంతో ఓ వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని చర్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఆ గ్రామ రైతు శేఖర్‌రెడ్డి పొలంలో వరినాట్ల పనులకు అదే గ్రామానికి చెందిన చంద్రయ్య కూలీ వెళ్లాడు. కరిగేట వద్ద విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసి స్టే వైరును పక్కకు సరి చేస్తుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న నాగన్న ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంజు నాథ్‌రెడ్డి తెలిపారు.

జత ఎద్దులు దొంగతనం

గద్వాల, జూలై 31: గద్వాల మండల పరిధిలోని శెట్టి ఆత్మకూర్‌కు చెందిన రైతు హనుమంతురెడ్డికి చెందిన రెండు ఎద్దులను బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. రైతు ప్రతీ రోజు మాదిరిగానే తన పొలం వద్ద ఎద్దుల కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చే సరికి ఎద్దులు కనిపించలేదు. ఎక్కడ వెతికిన కనిపించకపోవడంతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పర్వతాలు తెలిపారు. రెండు ఎద్దుల విలువ దాదాపు రూ.60వేలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

మన్యంకొండను దర్శించిన టీటీడీ ఏఈవో



మన్యంకొండ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు తీసుకున్న టీటీడీ అధికారులు

మహబూబ్‌నగర్ రూరల్ , జూలై 31: తెలంగాణ తిరుపతి గా పేరుగాంచిన మన్యంకొం డను తిరుమల తిరు పతి దేవ స్థాన అసిస్టెంట్ ఎగ్జిక్యూటి వ్ ఆఫీసర్ నందిని బుధవారం ద ర్శించుకున్నారు. మన్యంకొండను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఆల యా ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, కార్యనిర్వహణ అధికారి తిరుమల తిరుపతి దేవస్థానం అధి కారులకు ప్రతిపాదనలు పంపారు. దాంతో టీటీడీ ఏఈవో నందిని దేవస్థానాన్ని దర్శించారు. అనంతరం దేవస్థానం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు, జరగాల్సిన పనుల వివరాలను తెలుసు కున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మన్యంకొండను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఏఈవో నంది తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దేవాదాయ కార్యక్రమాల నిర్వాహకుడు డాక్టర్ ఉత్తరపల్లి రామాచార్యులు, శ్రీనివాస రాజు, నిత్యానందం, మన్యంకొండ అర్చకులు పాల్గొన్నారు.

మూతపడిన పాఠశాల

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఊర్కొండ, జూలై 31: నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని గుండ్లగుంటపల్లి ప్రాథమిక పాఠశాల మూతపడటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత నెల 30న పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు బదిలీ అయ్యాడు. అప్పటి నుంచి ఇక్కడ విధులు నిర్వహించడానికి ఎవరు రాకపోవడంతో పాఠశాల నెలరోజుల నుంచి మూతపడిందని పలువు రు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లగా ఆర్థి కంగా వెనుకబడిన మరి కొంతమంది విద్యార్థులు నిత్యం పాఠశాల ఆవరణలో కూర్చొని వస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరుతున్నారు.



మూతపడిన గుండ్లగుంటపల్లి పాఠశాల

బీఈడీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, జూలై31: భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ(బీఈడీ) కళాశాలలో 2024-26 విద్యాసంవత్సరానికి బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్ గోపిడి బుధవారం తెలిపారు. కోర్సులో చేరాలనుకునే అభ్యర్థులు డిగ్రీలో 40శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని కోరారు. మెరిట్ ప్రాతిపదికన విద్యార్థులకు ప్రవేశాలను కల్పించనున్నట్లు తెలిపారు. మహిళలకు ప్రత్యేక కేటగిరీ రిజర్వేషన్లు కేటాయించబడుతాయని తెలిపారు. దరఖాస్తులు భద్రాచలం, మన్ననూరు ఐటీడీఏ కార్యాలయాల్లో ఉచితంగా ఇవ్వబడుతాయని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను పోస్టుకవర్‌కు రూ. 10ల స్టాంప్ అంటించి భద్రాచలంలోని కళాశాలకు పంపించాల ని కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి జైలు

వెల్దండ, జూలై 31 : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన వరికుప్పల రాజు ఈ నెల 26న మద్యం తాగి వాహనం నడుపుతుండగా నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సమీపంలో పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేయగా కల్వకుర్తి జూనియర్ సివిల్ న్యాయాధికారి కావ్య విచారణ జరిపి రెండురోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా - 15మందికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 31 : ఆటో బోల్తా పడి 15మందికి గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం శ్రీపురం నుంచి నాగర్‌క ర్నూల్‌కు నిత్యం ప్రయాణికులను చేరవేసే ఆటో పరిమితికి మించి ఎక్కించుకుని వస్తుండగా నాగర్‌కర్నూల్ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో దాదాపుగా 25మంది ప్రయాణిస్తుం డడంతో 15మందికి తీవ్ర గాయాలు కావడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై తమ కు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

మానవపాడు, జూలై 31: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొనడంతో అం దులో ఉన్న డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన గద్వాల జిల్లా మానవపాడు మండల పరిధిలోని బోరవెల్లి స్టేజీ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. బుధవారం ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు నుంచి మంగళవారం రాత్రి బండల లోడుతో కర్నూలు జిల్లా బేతంచెర్లకు వెళ్తున్న లారీ బోరవెల్లి స్టేజీ సమీపంలో జాతీయరహదారి పక్కకు ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చి ఢీకొనడంతో లారీ నడుపుతున్న డ్రైవర్ రమణయ్య(55) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలి: కేవీపీఎస్

బిజినేపల్లి, జూలై 31 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నం ది వడ్డెమాన్ గ్రామ శివారులోని సర్వే నెంబరు 381లోని ఆరు ఎకరాల భూమి ఆక్రమించుకొని అవులోనికుంట అలుగు పారకుండా కబ్జా చేసిన నీటి కుంట భూములను స్వాధీనం చేసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ శ్రీరాములుకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో రైతులు వినితి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు డొక్క శ్రీనివాసులు, మ్యాతరి సుదర్శన్, వీరస్వామి, శేఖర్, చిన్నయ్య, సుబ్బయ్య, రాములు తదితరులున్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సంతాన పరిమితి ఆంక్షలు ఎత్తివేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 31: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంతాన పరిమితి ఆంక్షలను ఎత్తివేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. బుధవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్ల నిరంజన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయకుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంతాన పరిమితి విధించారని పేర్కొన్నారు. దీంతో చాలా మంది వ్యక్తులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సు ధాకర్‌గౌడ్, నాయకులు నిరంజన్‌యాదవ్, కొట్ర శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుంగ్‌ఫూ టోర్నీ ట్రోఫీ ఆవిష్కరణ



జాతీయస్థాయి కుంగ్‌ఫూ టోర్నీ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 31: హనుమాన్ కరాటే అసోసి యేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 11న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్ ట్రోఫీ నిర్వహించనున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు ఎన్పీ వెంకటేశ్ ట్రోఫీని ఆవిష్కరించారు. జాతీయస్థాయి టోర్నీ నిర్వహించడం పట్ల మాస్టర్ వెంకటేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

స్టేడియంలో సీసీ కెమెరాల ఏర్పాటు



మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 31: మహబూబ్‌నగర్ స్టేడియంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలో నిఘా కరువు అనే శీర్షికన ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో కథనం ప్రచురితం అయింది. దాంతో జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సీసీ కెమె రాల ఏర్పాటు చేశారు. బుధవారం డీవై ఎస్‌వో శ్రీనివాస్ సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియను పరిశీలించారు. మైదానం మొత్తం కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు బిగించినట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం మాత్రమే ఆటలు ఆడుకునేందుకు, వా కింగ్‌కు అనుమతిస్తాం. ఇతర వేళల్లో ఎవరినీ అనుమ తించమని తెలిపారు. సకాలంలో కార్యాలయ సిబ్బంది విధులకు హాజరుకావాలని సూచించారు.

మహిళ అదృశ్యం - కేసు నమోదు

వెల్దండ, జూలై 31 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని గాన్‌గాట్ తండాకు చెందిన రాత్లావత్ స్వప్న అదృశ్యం కావడంతో కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. స్వప్నకు ఆమె భర్త నరేష్‌కు తరచూ గొడవలు ఏర్పడ్డేవి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఈనెల 29న తన కుమారుడు, కూతురును తీసుకుని ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం స్వప్న తండ్రి గోపాల్ ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి నిధులు పెంచాలి

- సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర, జిల్లా నాయకులు ఎం.శ్రీనివాసులు, వార్ల వెంకటయ్య

- వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 31: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసులు, రాష్ట్ర నాయకుడు వార్ల వెంకటయ్య అన్నారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర బడ్జెట్ పత్రాల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారతదేశ రైతాంగానికి భారంగా ఉందని, తక్షణమే బడ్జెట్‌ను సవరించి వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశంలో రైతాంగానికి మద్దతు ధరలను సూచించిన స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయకుండా ఆయనకు భారతరత్న ప్రకటించడమేంటని ప్రశ్నించారు. ఇటీవలే ప్రకటించిన మద్దతు ధరలు శాస్త్రీయంగా లేవని, వాటిని స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం నిర్ణయించామని కేంద్రం తప్పుడు ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటల పెట్టుబడిని 50 శాతం కలిపి మద్దతు ధరలను నిర్ణయించాలన్నారు. కేరళ మాదిరిగా రైతు విమోచన కమిషన్ చట్టం చేయాలని భారత దేశంలో రైతులు పండించే పంటలను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మద్దతు ధరలు అమలు చేయకపోవడం వల్ల దేశ వ్యాప్తంగా రైతాంగం లక్షల కోట్ల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పంటల ఇన్సూరెన్స్ పథకం కూడా ప్రైవేటు కంపెనీలకే లాభాలు తెచ్చి పెడుతున్నాయని, దానికి మార్చి రైతాంగానికి మేలు జరిగే విధంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కోకన్వీనర్లు సి.బాల్‌రెడ్డి, కృష్ణాజీ, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రమేష్, వి.వెంకటేష్, బాలరాజు, నాయకులు సత్యనారాయణ, శివరాములు, గోపి, వెంకటస్వామి, క్రాంతి, లింగం, శివ, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

డివైడర్‌పై చెట్ల తొలగింపు



కొనోకార్పస్ చెట్లను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

అచ్చంపేట, జూలై 31: గత ప్రభుత్వంలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా పట్టణ సుందరీకరణ కోసం ప్రధాన రహదారి వెంబడి కొనోకార్పస్ మొక్కలను నాటారు. ఈ మొక్కల వల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా శ్వాసకోస, చర్మ సంబంధిత వ్యాధులకు మూలమవుతుందని పలువురు మునిసిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇదిలా ఉండగా స్థానిక ఎమ్మెల్యే వైద్యుడు కావడంతో ప్రత్యేక శ్రద్ధ పెట్టి చెట్లను తొలగించేలా ఆదేశాలు ఇవ్వడంతో పట్టణంలోని నాగర్ కర్నూల్-శ్రీశైలం ప్రధాన రహదారి డివైడర్‌పై ఉన్న కొనోకార్పస్ చెట్లను తొలగింపును చేపట్టారు. డివైడర్‌పై చిన్నపాటి పూల మొక్కలు పెంచాలని, ఏపుగా పెరిగే చెట్లను పెంచడం వల్ల యూటర్న్ తీసుకునే వారికి అవతలివైపు వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చెసుకుంటున్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు. చెట్ల తొలగింపుతో వాహనదారులకు మేలుతో పాటు హానితలపించే చెట్లు పోయాయని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'వడ్డెర బస్తీలో ప్రజా సమస్యలు పరిష్కరించాలి'

కల్వకుర్తి, జూలై 31 : కల్వకుర్తి పట్టణంలోని వడ్డెర బస్తీ, ఎన్‌జీవో కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా సీనియర్ నాయకుడు చిలుక బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం వడ్డెర బస్తీ ఎన్‌జీవో కాలనీలను సీపీఎం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో నెలకొన్న సమస్యలను సీపీఎం నాయకులకు ప్రజలు వివరించారు. అనంతరం చిలుక బాల్‌రెడ్డి మాట్లాడుతూ వడ్డెర బస్తీలో గత 15 సంవత్సరాల క్రితం సుమారు 40కుటుంబాలకు 70గజాల చొప్పున ఇంటి స్థలం ఇచ్చిందని పేర్కొన్నారు. 15 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఈ రోజు వరకు వారికి ఎలాంటి మెరుగైన వసతులు కల్పించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అర్హులైన వడ్డెరలకు ఇంటి స్థలాలతో పాటు ఆ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఆంజనేయులు, పరుశరాములు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల ముందు వాహనాలు నిలపరాదు

- నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న దుకాణం సీజ్

అచ్చంపేటటౌన్ , జూలై 31: ఆర్టీసీ వ్యాపార దుకాణాల ముందు పండ్ల బండ్లు ఇతర వాహనాలు నిలపరాదని ఆర్టీసీ డిపో మేనేజర్ వి.ప్రసాద్ అన్నారు. ఆర్టీసీ పరిధిలోని దుకాణాల ముందు నిబంధనలకు విరుద్ధంగా పండ్ల బండ్లు, ఇతర వాహనాలు పెడుతున్నారన్న సమాచారంతో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై పండ్ల బండి పెట్టి నడుపుతున్న దుకాణాన్ని ఆయన సీజ్ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణ దారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పరిధిలోని దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. ఎవరైన అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదేవిధంగా దుకాణాల ముందు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రుణమాఫీలో అన్నీ కోర్రీలే'

బిజినేపల్లి, జూలై 31 : ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభల్లో మాట్లాడుతూ ఎలాంటి వ్యవసాయ రుణమైన షరతులు లేకుండా రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఓట్లు దండుకొని గద్దె నెక్కి రుణమాఫీ అమలుకు రక రకాల రూల్స్ పేరుతో కోర్రీలు పెట్టారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ గంగనమోని కురుమయ్యతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్న ఇప్పటి వరకు మహిళలకు రూ.2500, ఆసరా పింఛన్ల రూ.4 వేలు, రైతు భరోసా పథకం ద్వారా రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు వంటి ప్రధాన హామీలు అమలు చేయకుండా ప్రజలు మోసం చేశారని అన్నారు. బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ రామునాయక్, మండల నాయకులు గోవింద నాగరాజు, మాజీ కోఆప్షన్ మెంబర్ జాహంగీర్, శివ, తిరుపతి నాయక్ ఉన్నారు.

సమస్యలపై గళం విప్పితే అణచివేస్తారా



ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్‌ను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

తాడూరు, జూలై 31 : సమస్యల పట్ల గళం విప్పిన వారిని అణగతొక్కి వేయడం ప్రభుత్వానికి ఎంత మేరకు సమంజసమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఆటో కార్మికుల సమస్యల పట్ల నిరసన తెలిపే కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో ముందస్తు అరెస్టు చేసి పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా సమస్యల పట్ల పోరాటం చేసే వారిని అణచివేసే ప్రయత్నం చేస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం అన్ని సమస్యల పరిష్కారానికి ముందుండి కృషి చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. అరెస్టు అయిన వారిలో ఏఐటీయూసీ భవన నిర్మాణ సంఘం ఉపాధ్యక్షుడు చిన్న కుర్మయ్య, సత్యం తదితరులు ఉన్నారు.

నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

బిజినేపల్లి, జూలై 31 : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్‌పై బిజినేపల్లి స్కూల్ కాంప్లెక్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఒక్క రోజు శిక్షణ శిబిరం నిర్వహించినట్లు జీహెచ్‌ఎం రాములు నాయక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నవంబర్ నెలలో 3వ, 6వ, 9వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించడం కోసం నిర్వహించే పరీక్షల నిర్వహణపై ఉపాధ్యాయులందరికీ శిక్షణ శిబిరంలో సూచనలు, సలహాలు, పరీక్షల నిర్వహణపై సందేహాలను నివృత్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పాలెం, మంగనూర్, గంగారం స్కూల్ కాంప్లెక్స్ జీహెచ్‌ఎంలు, రిసోర్స్ పర్సన్స్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాలొన్నారు.

యువతకు స్ఫూర్తి ఉద్దమ్‌సింగ్



ఉద్దమ్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఎస్‌ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కొల్లాపూర్, జూలై 31 : స్వాతంత్ర్య సమరయోధుడు ఉద్దమ్‌సింగ్ 83వ వర్ధంతిని బీఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గిరిజన కళాశాల వసతి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దమ్‌సింగ్ చిత్రపటానికి బీఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్ నియోజకవర్గ బీఎస్‌ఎఫ్ఐ కార్యదర్శి బి.కార్తీక్‌లు ఉద్దమ్ సింగ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వసతి గృహ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 31 : బాలికలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో బాలబాలికలకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్ఐ విజయలక్ష్మి, షీటీమ్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దిక్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దు

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, జూలై 31 : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని కార్యకర్తలకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే నివాస గృహంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మునిసిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రాజోయే ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీదేనని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం అన్ని వార్డుల్లో కమిటీని ఏర్పాటు చేసి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు, అక్రమ నిందలు జరుగుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

ఆత్మహత్యాయత్నానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

వంగూరు, జూలై 31: మండలంలోని ఉల్పరలో రైతు క్యామ వెంకటేష్ ఆత్మహత్యాయత్నానికి బాధ్యులైన వారిపై పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని తగు చర్యలు తీసుకోవాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూ తగాదాలో ఉల్పర గ్రామంలో ఓ వర్గానికి చెందిన వారు క్యామ వెంకటేష్‌పై దౌర్జన్యంగా దాడులకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. భూ తగాదా సమస్యను సంబంధిత అధికారులు విచారణ చేసి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. సీఎం సొంత మండలంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తాము ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంపై పోరాడుతామని అన్నారు. గణేష్ రావు, కోట్ల నరేందర్‌రావు, మంద రాజేందర్ రెడ్డి, ఎల్లగౌడ్, ఆంజనేయులు, జంగయ్య, జిలుకర సైదులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

లక్ష్మయ్యకు ప్రముఖుల నివాళి

వంగూరు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన కొమ్ము లక్ష్మయ్య మృతదేహానికి బుధవారం అచ్చంపేట, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు బాలరాజు, జైపాల్‌యాదవ్, మాజీ ఎంపీ రాములు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మాజీ సర్పంచులు గణేష్‌రావు, నారాయణరావు, అల్వాల్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రావు, రాజేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, బాలస్వామిగౌడ్ పాల్గొన్నారు.

పీఆర్ఎల్ఐ ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలి

- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, జూలై 31 : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పందించి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర మాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. జైపాల్‌రెడ్డి జాతీయ నాయకుడని, పీఆర్ఎల్ఐని పూర్తి చేయించి 12 లక్షల 50వేల ఎకరాలకు సాగునీరందించి ఆయన ఆత్మకు శాంతి కలిగేలా చూడాలని కోరారు. కల్వకుర్తి పట్టణంలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం తన సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు కల్వకుర్తిని సైతం అభివృద్ధి చేయాలని, అందుకు తక్షణమే రూ.1000 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మంజూరైన పనులను మళ్లీ మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసి పనులు పూర్తయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, పీఏసీఎస్ ఛైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మన్ వి.బాలయ్య, కౌన్సిలర్ సూర్యప్రకాశ్‌రావు, నాయకులు మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



పదవీ విరమణ పొందిన ఏఎస్ఐలు రషీద్, ఇస్మాయిల్‌ను సన్మానిస్తున్న ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 31 : పదవీ విరమణ ప్రతీ ఉద్యోగికి తప్పదని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జిల్లా క్రైం రికార్డు బ్యూరోలో పని చేస్తున్న ఏఎస్ఐ రషీద్, ఊర్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఇస్మాయిల్‌లు పదవీ విరమణ పొందుతున్న వారిని జిల్లా ఎస్పీ కార్యాలయ సముదాయంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 సంవత్సరాలు పోలీస్‌శాఖలో మంచి సర్వీస్ చేయడం హర్షణీయమన్నారు. పదవి విరమణ అనేది ప్రభుత్వ ఉద్యోగానికే తప్ప తాము చేస్తున్న కార్యకలాపాలకు కాదని ఆరోగ్యం సహకరిస్తే ప్రజా జీవితంలో పని చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, డీసీఆర్‌బీ సీఐ ఉపేందర్‌రావు, డీసీఆర్‌బీ ఎస్ఐ కృష్ణయ్య, ఎస్పీ సీసీ బాలరాజు, పదవీ విరమణ పొందిన పోలీస్ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

● కోడేరు: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ ఉంటుందని మండల నోడల్ అధికారి భాస్కర్‌శర్మ అన్నారు. మండల పరిధిలోని ఎత్తం గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్‌మారం నిర్మల పదవీ విరమణ పొందారు. మండల విద్యాశాఖ సిబ్బంది నాగేంద్రం, బంగారయ్య, సీఆర్పీలు సాయికుమార్, విజయలక్ష్మి, భోజ్యా నాయక్, టీచర్లు కృష్ణ, చంద్రశేఖర్ తదితరులు నిర్మలను శాలువాతో సత్కరించారు.

● కొల్లాపూర్: విధి నిర్వహణలో ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని ఆర్డీవో పి.నాగరాజు పేర్కొన్నారు. బుధవారం కొల్లాపూర్ మండల ఎంపీడీవో పట్టాభిరామారావు పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ఆర్డీవో, ఎంపీవో మనోహర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాలువా పూలమాలతో ఎంపీడీవోను సన్మానించారు. సూపరింటెండెంట్ శేఖర్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఊర్కొండ: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని రైతువేదికలో పదవీ విరమణ పొందుతున్న ఏఎస్సై ఇస్మాయిల్‌కు డీఎస్పీ, సీఐ, ఎస్సైలు సన్మానించారు. కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్సైలు వీరబాబు, మహేందర్, మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం అధ్యయనం

ఉప్పునుంతల, జూలై 31: మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ప్రజా సమస్యలపైన అధ్యయనం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు కాలనీలలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దేశ్యానాయక్ మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా ఇనాం భూములకు పట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు. సీపీఎం మండల నాయకులు నాగరాజు, శ్రీరాములు, సైదులు, రవి, పరశురాములు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెద్దకొత్తపల్లి, జూలై 31 : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని నేచర్ ఫ్రెండ్స్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ సభ్యులు రమేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని యాపట్ల సమీపంలో గల నల్లమల అడవి ప్రాంతంలో వేప, చింత, రావి, మర్రి, నేరేడు వంటి 20వేల మొక్కల విత్తనాలను నాటారు. సొసైటీ సభ్యులు కే.శ్రీనివాస్, జి.నాగరాజు, పి.వెంకటేశ్, శ్రీశైలం, శేఖర్, కుర్మయ్య ప్రదీప్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

నాసరయ్య దర్గా వద్ద హైమాస్ట్ లైట్ల బిగింపు

మన్ననూర్, జూలై 31: అమ్రాబాద్ మండలం మన్ననూరులోని నాసరయ్య స్వామి దర్గా వద్ద ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ , జడ్పీటీసీ మాజీ సభ్యురాలు డాక్టర్ అనూరాధల సహకారంతో రెండు హైమాస్ట్ లైట్లను బిగించారు. దర్గా వద్ద రాత్రి వేళల్లో చీకట్లో పడుతున్న భక్తుల ఇబ్బందులను అమ్రాబాద్ మాజీ వైస్ ఎంపీపీ సంభుశోభ, భక్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి లైట్లను ఏర్పాటు చేశారన్నారు. దర్గా వద్ద వెలుగు ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే దంపతులకు భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు.

బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు

చారకొండ, జూలై 31: మండలంలోని వివిధ గ్రామాలకు బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని తుర్కలపల్లిలో కె.శ్రీలత, జూపల్లిలో శ్రావణ్, జేపల్లిలో మల్లేష్, కమాల్‌పూర్‌తండాలో రవి, శాంతిగుడెంలో ఎండీ అల్తాఫ్‌అహ్మద్, సిర్సనగండ్లలో ఎం. సురేందర్‌రెడ్డిలు పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని వారికి సూచించారు.

మానవ జీవితం మొక్కలతో ముడిపడి ఉంది

తెలకపల్లి, జూలై 31 : మానవ జీవితం మొక్కలతో ముడిపడి ఉందని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని గౌరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఎంపీడీవో కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మానవ జీవితం చెట్లతో ముడిపడి ఉందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విద్యార్థులకు ఎంపీడీవో సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, గౌరెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి అనిత, మాజీ సర్పంచ్ బాలగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ రామస్వామి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

● తాడూరు: వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో నాటుతున్న మొక్కలన్నింటినీ సంరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో జ్యోతి పరోషియా అన్నారు. బుధవారం మండలంలోని యాదిరెడ్డిపల్లి గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఏపీవో చంద్రసిద్దార్థ, ఏపీఎం శేఖర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటిన డీఎం

కొల్లాపూర్: ఆర్టీసీ ఎండీ ఆదేశానుసారం కొల్లాపూర్ ఆర్టీసీ బస్సు డిపోలో బుధవారం డిపో మేనేజర్ ఉమాశంకర్ డిపో ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు సంకల్పంతో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సిబ్బందిని ఆయన కోరారు. అంతకు ముందు డిపోలో నిర్వహించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో పాల్గొని జూలై నెలలో అత్యధికంగా ఆయిల్ సేవ్ చేసిన డ్రైవర్లకు అత్యధికంగా ఇన్సెటివ్ తీసుకున్న కండక్టర్లకు, వృత్తిలో నైపుణ్యత కనబర్చిన డిపో మెకానిక్ సిబ్బందికి ఆయన ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అదేవిధంగా లక్ష్యే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా డిపోలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. ట్రాఫిక్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, మెకానిక్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, కార్యాలయ డిప్యూటీ సూపర్‌వైజర్ అజయ్‌తోపాటు ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు పర్యవేక్షించాలి

అమ్రాబాద్, జూలై 31: వర్షకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సంపూర్ణ పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని అమ్రాబాద్ ఎంపీడీవో బాలచంద్ర సృజన్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హరితహారం పనుల టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆయన అన్నారు. చెంచుల సమగ్ర అభివృద్ధి కోసం చెంచుపెంటల్లో కార్యదర్శులు పర్యటించి ప్రణాళికలు రూపొందించాలని ఆయన సూచించారు. మండల పంచాయతీ అధికారి కర్ణనాయక్, ఈజీఎస్ ఏపీవో రఘు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

తిమ్మాజిపేట, జూలై 31 : తిమ్మాజిపేట మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన మూడావత్ రాములు గత కొన్నాళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. అతనికి క్యాన్సర్ సర్జరీ మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రెండు లక్షల ఎల్‌వోసీని హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో బుధవారం కుటుంబు సభ్యులకు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి అందజేశారు.

ఇన్‌చార్జి ఏజీపీని సన్మానించిన వాకర్స్ అసోసియేషన్

అచ్చంపేటటౌన్, జూలై 31: అచ్చంపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఇన్‌చార్జి ఏజీపీ)గా అడ్వకేట్ గంజి సుధాకర్‌ను బుధవారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన సివిల్ కేసులను కోర్టులో వాదించనున్నట్లు ఆయన తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చందునాయక్, ప్రధాన కార్యదర్శి డిపూటీ తహసీల్దార్ రమేష్, సభ్యులు నగేష్, నర్సీజి, బిచ్యానాయక్, రూప్లా, నిరంజన్, భాస్కర్ స్వామి పాల్గొన్నారు.

పాఠశాలలో పునఃప్రారంభమైన మధ్యాహ్న భోజనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లాపూర్, జూలై 31 : 'సర్కార్ బడిలో భోజనం బంద్' అనే కథనం పేరుతో ఈ నెల 29న 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి బుధవారం జిల్లా అధికార యంత్రాంగం కదిలింది. కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం లేక విద్యార్థులు అల్లాడుతున్నారని విషయాన్ని ఎత్తిచూపింది. దీంతో డీఆర్‌డీవో ఏపీడీ, వెలుగు అధికారులు బుధవారం పాఠశాలను సందర్శించారు. మహిళా సంఘాలతో చర్చించి సింగోటం జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం పునఃప్రారంభించేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల సమస్యపై కథనం ప్రచురించినందుకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆంధ్రజ్యోతి పత్రికను అభినందించారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

తెలకపల్లి, జూలై 31 : ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం మండల నాయకుడు చిటికెల రామకృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గడ్డంపల్లిలో నెలకొన్న సమస్యలను బుధవారం సీపీఎం బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో 6, 7వార్డుల్లో మట్టి రోడ్లపై మురుగునీళ్ల మల్లుకొని మనుషులు నడవరకుండా స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదని ఆయన అన్నారు. గ్రామంలో చాలా మందికి మట్టిమిద్దెలు ఉన్నాయని, వారికి ఇళ్ల మంజూరయ్యాయని చెప్పడమే తప్ప మంజూరు కాకపోవడం ఆ మట్టి మిద్దెల్లోనే జీవనం కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లేక సీసీ రోడ్లపై మురుగునీరు పారుతున్నదని, కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులకు గురై అవకాశాలు ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలో తేలిన విషయాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సమస్యల పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం చేస్తామని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నాయకులు బుచ్చయ్య మాసమ్మ, నరసింహ, రమేష్, సరస్వతి, రాములు, ఆనంద్ పాల్గొన్నారు.

ఎస్సై-2గా బాధ్యతలు చేపట్టిన ఇందిర

అచ్చంపేటటౌన్, జూలై 31: అచ్చంపేట ఎస్సై-2గా ఎస్సై ఇందిర బుధవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణానికి చెందిన అంజనీమాత సేవాసమితి సభ్యులు సునీతాబాయి, శకుంతల, ఓబులశెట్టి, హేమలత, అశ్విని, నాగేంద్రబాయి తదితరులు ఆమెను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో బాలికల కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల, బస్టాండ్ సమీపంలో విద్యార్థినులను ఏవరైన పోకిరీలు వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్తమ ప్రతిభను కనబర్చాలి

తెలకపల్లి, జూలై 31 : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో విద్యార్థులందరూ ఉత్తమ ప్రతిభ చూపాలని మండల నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలకపల్లి మండల పరిధిలోని కార్వంగ, తెలకపల్లి, గౌరెడ్డిపల్లి పాఠశాలల సముదాయ సమావేశాలు బుధవారం మండల విద్యావనరుల కేంద్రం తెలకపల్లిలో నిర్వహించారు. పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు చల్మారెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ కావ్య, మల్లేష్, మణికంఠ, జైపాల్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం'

వెల్దండ, జూలై 31 : ఎన్నికలకుముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజల విశ్వాసం చూరగొంటున్నామని బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రైతులకు ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తామని ఇచ్చినమాట నిలబెట్టుకుంటున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చినా రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కాంగ్రెస్ ఆ దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీపై వెనుకడుగు వేసిందని, వారు ఇచ్చిన హామీ అమలుకాక రైతుల వడ్డీలు కుప్పలుగా పేరుకుపోయాయని విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

కల్వకుర్తిటౌన్, జూలై 31 : బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కల్వకుర్తి పద్మశాలిసంఘం అధ్యక్షుడు నాగుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన వెల్దండలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితున్ని పరామర్శించి మాట్లాడారు. బాధితునికి చెందిన పొలం కేసులోఉండేగానే అగ్రవర్ణానికి చెందిన వారు అక్రమంగా పొలాన్ని దున్నడంతో పురుగులమందు సేవించడం చాలా బాధాకరమన్నారు. ఆయనకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పద్మశాలి సంఘం కార్యదర్శి మన్నపాండయ్య కోశాధికారి మ్యాకల రాజేందర్, ఉపాధ్యక్షులు బోడ నర్సింహ, నాగ భూషణం, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులున్నారు.

భోజనం నాణ్యతగా లేదు..

బల్మూరు, జూలై 31 : బీసీ బాలికల వసతి గృహంలో వడ్డించే భోజనం నాణ్యతగా లేదని వెంటనే భోజన సౌకర్యాల విషయంలో జాప్యం చేయకుండా చక్కగా విద్యార్థులకు అందించాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు క్రమశిక్షణ ఇవ్వాలని వారన్నారు. ఎంపీడీవో జట్టి రాఘవులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఖదీర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

'బాలికల దాహార్తిని తీర్చిన ఎమ్మెల్యే'

బల్మూరు, జూలై 31 : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో నీటి కొరతతో అల్లాడుతున్న విషయంపై చలించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వెంటనే తన సొంత నిధులతో బాలికల దాహార్తిని తీర్చేందుకు పాఠశాల ఆవరణలో బోరు వేయించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక మాజీ ఎంపీటీసీ ఖదీర్, మండల అధ్యక్షుడు వెంకటరెడ్డిలు దగ్గర ఉండి బోరు తవ్వించారు. విద్యార్థుల నీటి కొరత సమస్య పట్ల వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కేజీబీవీ పాఠశాల ఎస్‌వో లలిత, బీసీ వసతి గృహం వార్డెన్ కురువమ్మ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

పెద్దకొత్తపల్లి, జూలై 31 : సంక్షేమ హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు బి.శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆదేవిధంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. బీఆర్ఎస్‌వీ మండల నాయకులు సాయి, జోగేందర్, నితిన్ పాల్గొన్నారు.

నూతన భవనం ఏర్పాటు చేయాలి

అచ్చంపేటటౌన్, జూలై 31: అచ్చంపేట జూనియర్ కళాశాల భవనం ప్రమాదభరితంగా మారిందని నూతన భవనాన్ని ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్ అన్నారు. బుధవారం పట్టణంలోని కళాశాలను పరిశీలించి కళాశాలలో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఈశ్వర్, సాయి, ఉదయ్ కిరణ్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.